ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

సర్పంచులకు ఎనిమిది, వార్డులకు 76 నామినేషన్లు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. 3 సర్పంచి, 28 వార్డు మెంబర్ల పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. దీనిలో భాగంగా 3 సర్పంచి పదవులకు ఎనిమిది, 28 వార్డు సభ్యుల పదవులకు 76 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లికార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వార్డు మెంబర్ల పదవి కోసం 76 నామినేషన్లు వేయగా, 9 వార్డు మెంబర్లు పదవులకు మాత్రం సింగిల్ నామినేషన్లు వేసినట్లు ప్రకటనలో జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

గురువుల వేతన రోదన..!

- మూడు నెలలుగా అందని వేతనాలు
- జిఒ 117 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకూ తప్పని తిప్పలు
- హై స్కూల్ ప్లస్‌లో చేరిన పిజిటిలదీ అదే పరిస్థితి
- ఉమ్మడి జిల్లాలో రెండు వేల మందికి అందని జీతాలు
- గందరగోళంగా అధికారుల సమాధానం
- చెల్లించకపోతే మరో ఆందోళనకు సిద్ధం : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

ఉమ్మడి జిల్లాలో వేతనాల కోసం గురువులు గగ్గోలు పెడుతున్నారు. రెండు మూడు నెలల నుంచి జీతాలందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిఒ 117 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. హైస్కూల్ ప్లస్‌లో చేరిన పిజిటిలది కూడా ఇదే పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు వేల మంది ఉపాధ్యాయులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే దీనిపై ఇటు ప్రభుత్వంగానీ అటు అధికారులు గానీ పట్టించుకోకపోవడమే కాకుండా పొంతనలేని సమాధానం చెబుతుంది. అయితే వివిధ కేటగిరిలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు తక్షణం జీతాలు అందించాలని లేనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధమవుతామని యుటిఎఫ్ హెచ్చరిస్తుంది. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా, అడుగుతున్న ఉపాధ్యాయులపై దౌర్జన్యానికి దిగి తీవ్ర నిర్బంధాలను విధిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుంది.

ఇదిలా ఉంటే నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వవిద్యను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయుల హక్కులను కాలరాసే విధంగా పాలన కొనసాగిస్తుంది. ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 117 జిఒ ద్వారా మంజూరైన పోస్టులు ఉపాధ్యాయులు వివిధ కేటగిరీల్లో విధులు నిర్వహిస్తున్నారు. మే నెలలో జరిగిన ఈ ప్రక్రియ ద్వారా కొత్తగా సృష్టించిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బదిలీపై చేరిన టీచర్లకు, జిల్లాలో ఎంపికచేసిన మండలాల్లో ఇంటర్ విద్యతో గతేడాది ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ (జెడ్‌పి జూనియర్ కళాశాల)లలో నియమించిన పిఇటిలకు, ఎంఇఒల కొత్తగా ఏర్పాటు చేసిన పోస్టుల్లో, హెచ్‌ఎంలు లేనిచోట ఇలా వివిధ రకాల బదిలీల్లో వెళ్లి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు అందని పరిస్థితి ఏర్పడింది. రెండు మూడు నెలల నుంచి జీతాలు కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల బిల్లులను ఆమోదించడానికి జిల్లాస్థాయిలో ఇంతవరకూ ఖజానాశాఖకు రాష్ట్ర ఖజానా కార్యాలయం నుంచి సరైన వివరాలు అందకపోవడమే దీనికి కారణమని జిల్లా విద్యాశాఖ మీద ఆరోపణలున్నాయి. ప్రభుత్వం కూడా కనీసం దృష్టి సారించట్లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఈ ఏడాది జూన్‌లో కొత్తగా ఆయా ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలకు వివిధ సబ్జెక్టుల్లో క్రియేట్ చేసిన స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులకు కూడా జీతాలు అందని పరిస్థితి తలెత్తింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీప ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో పెద్దసంఖ్యలోనే ఎస్‌జిటిలు మిగులు (సర్ ప్లస్) ఉపాధ్యాయులుగా ఉన్నారు.

వం రో వ్వై వ్ర ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాల్సి ఉండటంతో అర్హులైన ఎస్‌జిటిలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొంది కౌన్సెలింగ్ ద్వారా ఆయా యుపి స్కూళ్లల్లో గత నెలలో బదిలీపై నియమించారు. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్న పాఠశాలలకు బదిలీ అయిన టీచర్లకు జీతభత్యాల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదు కానీ కొత్తగా క్రియేట్ చేసిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బదిలీపై చేరిన ఉపాధ్యాయులకే జీతాల చెల్లింపులో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో సాధారణ బదిలీల్లో ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో దాదాపు రెండు వేల మందికి గత రెండు మూడు నెలల నుంచి జీతాలు అందని పరిస్థితి ఉంది.

సవాలక్ష సమస్యలు పొంతనలేని సమాధానాలు

కొత్తగా భర్తీ చేసిన పోస్టులను కేడర్ స్ట్రెంగ్త్‌లో చేర్చకపోవడం, చేర్చినా వాటిని రాష్ట్ర కార్యాలయంలో ఇంతవరకూ ఆమోదించకపోవడం వల్ల సంబంధిత టీచర్ల వివరాలు ఖజానాశాఖకు అందలేదని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాల నుంచి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ (సిఎస్‌ఇ) కార్యాలయానికి చేరిన టీచర్ కేడర్‌ంగ్ వివరాల తుదిపరిశీలన జరుగుతోంది. ఆ తర్వాత వివరాలను సిఎస్‌ఇ ఆమోదించి రాష్ట్ర ట్రెజరీ కార్యాలయానికి పంపుతారు. ఆ తర్వాతే జిల్లా ఖజానా కార్యాలయానికి పంపిస్తారు. అప్పుడు మాత్రమే సంబంధిత టీచర్ల జీతాల బిల్లులను జిల్లాస్థాయిలో స్వీకరించి పరిశీలన అనంతరం ఆమోదిస్తే తప్ప జీతాలు అందే పరిస్థితి కనిపించట్లేదు. అయితే విద్యాశాఖ అధికారులు మాత్రం పొంతనలేని సమాధానం చెబుతున్నారు. జీతభత్యాలకు సంబంధించి అన్ని పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం కూడా పట్టనట్లు వ్యవహరించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధ్యాయులు ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లాలో జీతభత్యాల కోసం సుమారు రెండు వేలమంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. రెండు నెలల నుంచి జీతాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. రుణాలకు ఇఎంఐలు, కుటుంబ పోషణకు సమయానికి జీతాలందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా భర్తీ చేసిన పోస్టులు, బదిలీల్లో జరిగిన అవకతవకలు, ఉపాధ్యాయులపై కక్షపూరిత చర్యల కారణంగా వివిధ కేడర్లలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీతాల్లేక ఇబ్బంది పడుతున్నాం

బి.శ్రీనివాసరావు, పిజిటి ఉపాధ్యాయులు, పాలకోడేరు

నూతనంగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లో ఈ ఏడాది మే 22న పిజిటి ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాను. గ్రామాల్లో ప్రతీ ఇంటికి తిరిగి విద్యార్థినులను సమీకరించి ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేస్తున్నాము. మూడు నెలల నుంచి జీతాలు అందడం లేదు. ఆర్థికంగా నానా అవస్థలు పడుతున్నాను. వివిధ గృహరుణాలు ఇతరత్రా రుణాముల చెల్లింపులకు తీవ్ర అంతరాయం కలిగి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాను. ప్రభుత్వం స్పందించి మా జీతాలు మాకు ఇప్పించండి.

ఆందోళన చేపడతాం

బి.గోపిమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి



117 జిఒ తీసుకొచ్చి జిల్లాలో వివిధ రకాలుగా బదిలీలు చేపట్టారు. ఈ ప్రక్రియ వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మూడు నెలల నుంచి ప్రభుత్వం జీతాలివ్వడం లేదు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటికే జీతాలు చెల్లించాలని రెండు విడతల్లో ఆందోళనలు చేపట్టాము. ఈ నెల 12న 12 గంటల పాటు నిరసన కూడా తెలుపుతున్నాం. ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

పిల్లలకు అల్బెండజోల్ తప్పనిసరి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆరోగ్య సంరక్షణ దిశగా అడుగులు వేసి నులి పురుగులను నిర్మూలిద్దామని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. నులి పురుగుల నివారణలో భాగంగా చెన్నరంగనిపాలెం ఉన్నత పాఠశాలలో గురువారం చిన్నారులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ వేసి మాట్లాడారు. పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణలో భాగంగా ఏడాది నుండి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జిల్లావ్యాప్తంగా ప్రతీ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలు, కళాశాలు, వివిధ వసతి గృహాల విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నా భూమి-నా దేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టరు పిలుపునిచ్చారు. విద్యార్థులతో కలెక్టరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతిస్తుందన్నారు. చదువు మధ్యలోనే మానేసి బడిబయట ఒక్కరు కూడా ఉండ కూడదని కలెక్టరు అన్నారు. చెన్నరంగనిపాలెం ఉన్నత పాఠశాలను కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులను, కంప్యూటర్ డేటాను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా పంచాయతీశాఖ అధికారి జివికె.మల్లికార్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, పురపాలక సంఘం కమిషనర్ ఎం.శ్యామల, వైద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎఎన్‌ఎంలు, వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఏజెంట్లు

బీమా ప్రీమియంలపై జిఎస్‌టి రద్దు చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

బీమా ప్రీమియంలపై జిఎస్‌టిని రద్దు చేయాలని ఎల్‌ఐసి ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జోనల్ జనరల్ సెక్రెటరీ పిఎల్.నరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం ఏజెంట్స్ డిమాండ్స్ డే సందర్భంగా ఎల్‌ఐసి బ్రాంచి వద్ద ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. ఇ-బీమా పాలసీలను ఆపాలని, కమిషన్ పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. డైరెక్ట్ మార్కెటింగ్ ఆపాలని, గ్రూప్ ఇన్స్యూరెన్స్ లిమిట్ పెంచాలని, ప్రీమియం తగించాలని, గ్రూప్ ఇన్స్యూరెన్స్ ఏజెంట్ లిమిట్ పెంచాలని, గ్రాడ్యుటీని పెంచి, క్యాలిక్యులేషన్ విధానంలో మార్పు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఏజెంట్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు బ్రాంచి ఎల్‌ఐసి ఎఒఐ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షులు సలాది ఉదయభాస్కర్‌రావు, సెక్రటరీ మడిచర్ల రవిరామకృష్ణ, ట్రెజరర్ నార్కెడమిల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు పోలిశెట్టి శ్రీనివాస్, నాయకులు సుందరం ఆచారి, నార్ని వీరవెంకటరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ హక్కులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

ఘనంగా యుటిఎఫ్ 50వ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయుల హక్కులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ యుటిఎఫ్ లక్ష్యమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీ మూర్తి అన్నారు. యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపీమూర్తి హాజరై యుటిఎఫ్ ఉద్యమ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్ 1974 ఆగస్టు 10వ తేదీన ఒక చారిత్రక అవసరం కోసం ఏర్పడిందన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను రాష్ట్రంలో ఒక పెద్ద సంఘంగా తీర్చిదిద్దడానికి అనేకమంది వారి జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసం, వారి ఆర్థిక ప్రయోజనాల కోసం, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం అందరికీ సమానమైన విద్యావకాశాలు అందించడం కోసం అనేక పోరాటాలు చేయడమే కాకుండా సామాజిక స్పృహ కలిగిన సంఘంగా సమాజంలో ఏర్పడే అనేక విపత్కర పరిస్థితుల్లో అనేక సామాజిక కార్యక్రమాలు చేసిందన్నారు. ఈ 50 ఏళ్ల కాలంలో అనేక పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందన్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల హక్కుల కాపాడేందుకు, ఎన్నికల హామీలు అమలు చేయడం కోసం చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు, జిల్లా కార్యదర్శులు కెఎస్.రామకృష్ణ ప్రసాద్, జి.రామకృష్ణంరాజు, సిహెచ్ కుమార్‌బాబ్జి, జి.అబ్రహం, బి.నాగబాబు, బిఆర్‌ఎంకె.స్వామి, ఎస్.గోవింద్, జి.భవాని ప్రసాద్, మల్లుల శ్రీనివాస్ చింతపల్లి ప్రసాద్, కె.వామనమూర్తి, పి.గోపాల్‌రాజు, ఎన్.నరసింహయ్య, భీమరాజు పాల్గొన్నారు.

భీమవరంలో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న గోపీమూర్తి

పోడూరు: యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం గురువారం పోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డి.క్షేమమూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెయు రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ 1974 ఆగస్టు 10వ తేదీన ఒక చారిత్రాత్మక అవసరంగా యుటిఎఫ్ ఏర్పడిందని తెలిపారు. ఆనాటి నాయకులు చెన్నుపాటి లక్ష్మయ్య, మైనేని వెంకటరత్నం, ఎస్ఆర్ పోలిశెట్టి, అప్పరి వెంకటస్వామి, దాసరి వెంకట రామయ్య, తదితరుల ఆశయాలను నేటితరం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ ఉపాధ్యాయులు కెవివి సత్యనారాయణ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు, సహాధ్యక్షులు సిహెచ్.త్రినాథ్, బి.శేషగిరి, జి.కుమార్‌రాజ స్వామి, పి.శ్రీనివాస్, రామ్మోహన్, కె.చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని మేడపాడు సెంటర్లో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ వ్యవస్థాపక సభ్యులు వలవల శ్రీరామ్మూర్తి జెండాను ఆవిష్కరించారు. సభలో వక్తలు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విలీలాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.జయప్రభ, మాజీ సభ్యులు పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, ఎర్ర అజయ్, దేవ సుధాకర్, బోనం కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఐలు రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ నెల 12, 13 తేదీల్లో గుంటూరులో జరగనున్న ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి కోరారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్ హాలు వద్ద ఐలు 12వ రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను మాజీ అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది ఎన్‌విఎస్.రామానుజం (ఎజిపి) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామానుజం మాట్లాడుతూ.. మహాసభకు న్యాయవాదులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. మునిస్వామి మాట్లాడుతూ ఈ మహాసభలో న్యాయవాదుల సమస్యలపైన, న్యాయమూర్తులను నియమించడంలో జరిగే జాప్యంపైన, కక్షిదారులకు సత్వరం న్యాయం చేయడంలో న్యాయవాదుల పాత్ర, న్యాయవృత్తి పట్ల ప్రభుత్వ వైఖరి వంటి అనేక అంశాలపై చర్చిస్తార న్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, తణుకు మున్సిపల్ కౌన్సిల్ న్యాయవాది చోడే గోపీకృష్ణ, జి.అంబేద్కర్, యు.పుల్లేశ్వరరావు, కె.వెంకన్నబాబు, కె.కుటుంబరావు, డి.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడిపై దాడి అన్యాయం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - భీమవరం

పంచారామాల్లో ఒకటైన భీమవరం శ్రీసోమేశ్వర స్వామి ఆలయ అర్చకుడు నాగేంద్రశర్మపై అసభ్యంగా ప్రవర్తించి, భౌతిక దాడికి పాల్పడిన ఆలయ ఛైర్మన్ భర్త, వైసిపి నేత యుగంధర్‌పై తక్షణం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ఎన్‌వి.శర్మ, గేదెల ధనుష్ ప్రకటన విడుదల చేశారు. యుగంధర్ వైసిపి నేతగా చలామణి అవుతూ అధికార దురహంకారంతో అర్చకు డిపై అమానుషంగా దాడికి పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి దౌర్జన్యాలు ఆలయంలో మరలా పునరావృతం కాకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆల యంలో ఎగ్జిక్యూటివ్ అధికారి ఈ దాడికి గల కారణాలను గుర్తించి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో దేవాదాయ శాఖలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ అధికారుల పోస్టులను అక్రమ పద్ధతిలో నేరుగా నియమకాలు చేయడాని డివైఎఫ్ఐ బృందం పోరాటం చేసి అడ్డుకుందని తెలిపారు. దీనికి దేవాదాయ శాఖ మంత్రి స్పందించి కారుకులపై చర్యలు తీసుకుందన్నారు. దేవాదాయ శాఖలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ అధికారుల పోస్టు లను అధికారికంగా భర్తీ చేసి రాష్ట్రంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ కోరింది.

దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, దీనిలో భాగంగానే నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా గతేడాది హర్ ఘర్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఈ ఏడాది ఆజాదికా అమృత్ మహోత్సవాల పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఆనాటి స్వాతంత్ర సంగ్రామంలో దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు పోరాట యోధులను స్మరించుకోవడంతోపాటు భవిష్యత్ తరాలవారికి స్వాతంత్ర పోరాటం విశిష్టతను తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఈ ఏడాది నా మట్టి - నా భూమి పేరిట ఆగస్టు 9వ తేదీ నుండి 20వ తేదీ వరకూ కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. 9న పంచాయతీ కార్యాలయాల ఆధ్వర్యాన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశాలు ఉన్న శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలు నాటినట్లు తెలిపారు. 10న తేదీన పంచ ప్రాణ ప్రతిజ్ఞ అన్ని పాఠశాలలు, కళాశాలల్లో చేసినట్లు తెలిపారు. 11న వసుధకు వందనం పేరిట పాఠశాలలు, కళాశాలలు, పంచాయతీలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో కనీసం 75 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. 14న వీరులకు వందనం పేరిట దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను, వీరులను స్మరించుకుని వీరుల కుటుంబాలను సత్కరించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీకి చేరుకుని అక్కడ కర్తవ్యపథ్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్లోని వివిధ కార్యాలయాల సిబ్బంది, మీడియా ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ నా మట్టి - నా భూమి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే నూరుశాతం పూర్తి చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా నిమిత్తం ఇంటింటి సర్వేను వేగవంతం చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 5,60,111 కుటుంబాలు ఉన్నాయని, వాటిలో 2,60,919 కుటుంబాలకు ఇంటింటికీ బిఎల్‌ఒలు వెళ్లి పరిశీలిస్తున్నారని తెలిపారు. 56,065 కుటుంబాల సర్వే వివరాలను బిఎల్‌ఒలు యాప్‌లో అప్‌లోడు చేశారని తెలిపారు. 4,464 కొత్త ఓటర్లను గుర్తించి వారి వద్ద నుంచి ఫార్మ్‌ను తీసుకున్నామన్నారు. 10 ఓట్లు ఉన్న 6,276 కుటుంబాలను గుర్తించి వెరిఫికేషన్ చేశామన్నారు. ముఖ్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18 నుంచి 19 వయస్సులో ఉన్నవారు, ట్రాన్స్ జెండర్లు, నిరాశ్రయుల జాబితా తయారీలో ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇఆర్‌ఒలుగా నియమితులైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డ్వామా పీపీ ఎస్‌టివి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

12 గంటల నిరసనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై జిల్లా కేంద్రంలో ఈ నెల 12న చేపట్టనున్న 12 గంటల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా నేతలు పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ ఎఆర్‌కెఆర్ హైస్కూల్లో ఫ్యాప్టో సమావేశం బుధవారం నిర్వహించారు. సిపిఎస్, ఉపాధ్యాయులకు జీతభత్యాలు వంటి సమస్యలపై ప్రధానంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి చేపట్టిన 12 గంటల నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి ఆచంట విలేకరి మోహనరావుకు పితృవియోగం

ప్రజాశక్తి - పెనుమంట్ర, ఆచంట

ఆచంట ప్రజాశక్తి విలేకరి పరువు మోహన్‌రావుకు పితృవియోగం కలిగింది. వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన పరువు రంగారావు (73) అనారోగ్యంతో గురువారం మధ్యాహ్నం స్వగ్రామంలో మృతి చెందారు. ఆ యనకు భార్య గంగమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమారుడు పరువు మోహన్‌రావు ఆచంట మండల ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్నారు. మోహనరావు కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పెనుమంట్ర మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, నేతలు ఎస్‌విఎల్ శర్మ, ఉద్దిపర్తి అంజిబాబు, తోటపల్లి సత్యనారాయణ, ఉద్దిపర్తి శ్రీను, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆచంట విలేకరి పి.మోహనరావు తండ్రి రంగారావు మృతి పట్ల ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, డెస్క్ ఇన్‌ఛార్జి వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్, స్టాఫర్ పి.గంగరాజు, ఎడివిటి ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు, సర్కిలేషన్ ఇన్‌ఛార్జులు వై.సీతారాం, పి. పెద్దిరాజు, డివిజన్ ఆర్గనైజర్ కె.బాలాజీ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో జరగనున్న పంచాయతీ ఉప ఎన్నికల్లో నాలుగు నామినేషన్లు వచ్చినట్టు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మత్స్యపురి, మెంటేపూడిలో ఒక్కో వార్డుకు ఎన్నికలు జరగనున్నాయి. మత్స్యపురిలో ఒక వార్డుకు మూడు నామినేషన్లు రిటర్నింగ్ అధికారి శ్రీమన్నారాయణ, మెంటేపూడిలో ఒక వార్డుకు ఒక నామినేషన్ వచ్చినట్టు రిటర్నింగ్ అధికారి రాజేష్ తెలిపారు. దీంతో మెంటేపూడిలో ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉండగా, మత్స్యపురిలో పోటీ ఉండే అవకాశాలున్నాయి.

పెనుమంట్ర: మార్టేరు 14వ వార్డు సభ్యురాలి స్థానానికి ఒకే ఇంటికి చెందిన అక్కాచెల్లెలతోపాటు మరో రెండు నామినేషన్లు పంచాయతీలో దాఖలయ్యాయి. జాలెం సుచంద్రిక, జాలెం సుగందిక ఇద్దరూ అక్కా చెల్లెళ్లు. అలాగే వెలగలేరు 7వ వార్డుకు అన్నా తమ్ముడు నామినేషన్లు దాఖలు చేశారు. గుడిమెట్ల చైతన్య పేరెడ్డి (తమ్ముడు), గుడిమెట్ల వెంకటరెడ్డి (అన్న) ఇద్దరూ ఒకే ఇంటికి చెందిన వారు కావడం విశేషం. రెండు పంచాయతీల్లో చూసుకుంటే మార్టేరులో అక్కాచెల్లెలు, వెలగలేరులో అన్నాదమ్ములు కాజువల్ ఎన్నికలో వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. మార్టేరులో స్టేజ్ వన్ ఆఫీసర్‌గా ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ, వెలగలేరులో స్టేజ్ వన్ ఆఫీసర్‌గా పంచాయతీరాజ్ ఎఇ సత్తి నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్ సుధారాణి ఉన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచి, వార్డు మెంబర్స్‌గా కొనసాగుతూ మృతి చెందిన వారి స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఆగర్తిపాలెం గ్రామ సర్పంచిగా పనిచేస్తూ మృతి చెందిన కావలి నరసింహారావు స్థానానికి వారి కుమారుడు కావలి సీతారామనాయుడు, భార్య కావలి లక్ష్మీకుమారి నామినేషన్ దాఖలు చేశారు. దిగమర్రు ఏడో వార్డు కోసం మన్నే మోహన్‌రావు, వెలివెల పదో వార్డు కోసం కొప్పినీడి కృష్ణవేణి, చింతపర్రు ఆరో వార్డు కోసం అంగర రామలక్ష్మి, జి.వెంకటరమణ నామినేషన్లు దాఖలు చేశారు. గోరింటాడ ఆరో వార్డుకు నలుగురు, దగ్గులూరు గ్రామానికి చెందిన 12వ వార్డు కోసం ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారని ఎండిఒ సంఘాని వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆకివీడు : మండలంలో ఖాళీగా ఉన్న మూడు వార్డులకు ఉప ఎన్నికలు నామినేషన్ల ఘట్టం గురువారం పూర్తయింది. వీటిలో అజమూరులో సుమారు సంవత్సరం క్రితం పదో వార్డు సభ్యుడు బూరగ రామారావు మరణించడంతో స్థానం ఖాళీ అయ్యింది. ఆ స్థానంలో అతని భార్య శాంతకుమారి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆస్థానం ఏకగ్రీవమైంది. ఇక కుప్పనపూడిలో రెండో వార్డు, ఏడో వార్డు రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటికి ఒక్కొక్క వార్డుకు ఇద్దరు చొప్పున నామినేషన్ దాఖలు చేయడంతో మొత్తం నలుగురు పోటీలో ఉన్నారు.

మాట్లాడుతున్న లయన్స్ సభ్యులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షా శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టిమ్ మాణిక్యాలరావు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సిహెచ్ ఉషారాణి, ఎం.రామకృష్ణ, డి.మన్మథరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సాగునీరు ఇవ్వకపోవడం సిగ్గుచేటు'

ప్రజాశక్తి - పోడూరు

సార్వాకు సాగునీరు అందించలేకపోవడం సిగ్గు చేటని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. గుమ్మలూరు గ్రామంలో సాగునీరందక ఎండుతున్న పంట పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకూ వరదలు ముంచెత్తితే, నేడు నీరందక పంట ఎండిపోవడం దారుణమన్నారు. రావిగొప్పలోని తూర్పుకాలువపై 200 ఎకరాల వరకూ దమ్ముచేసే పరిస్థితి లేదని, నారుమళ్లలో నీరులేదని దీంతో నాట్లు వేయడం ఆలస్యమై రైతులు తర్వాత నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. తక్షణం కాలువలో పూడిక తీయించి పూర్తిస్థాయిలో సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ సమస్యను ఇరిగేషన్ డిఇ ఎస్‌వివి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. డిఇ స్పందిస్తూ తక్షణం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌలురైతులు రాపాక వెంకటేశులు, ఉన్నమట్ల బాలరాజు, గంగుల గంగయ్య, కండెల్లి విఘ్నేశ్వరరావు, కండెల్లి వెంకన్న, కండెల్లి శాంతారావు, చింపర్తి సూర్యారావు పాల్గొన్నారు.

వైసిపి నేతల కుటుంబాలకు పివిఎల్ పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల కాలంలో మృతి చెందిన వైసిపి నాయకులు బసవ పెద్దిరెడ్డి, దవిలి మారుతి కుటుంబాలను గురువారం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్ఆర్‌పి.అగ్రహారం గ్రామానికి చెందిన బసవ పెద్దిరెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో, క్రమశిక్షణతో పని చేశారన్నారు. మారుతి మంచి కార్యకర్తగా పార్టీ కోసం సేవలందించారన్నారు. వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు ధనుంజయ, మున్నలూరి శ్రీనివాస్, సూరవరపు వెంకటాచార్యులు ఉన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న టిడిపి నేతలు

బడుగు, బలహీనులకు టిడిపి అండ : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉండి

బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం టిడిపి పార్టీతోనే సాధ్యపడుతుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. గురువారం ఉండి పడవలరేవులో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న రామరాజు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భవించిన తర్వాత బడుగు బలహీన వర్గాలకు రాజకీయాలలో చోటు దక్కిందని తెలిపారు. అప్పటినుండి బడుగు బలహీన వర్గాలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా పనిచేశారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాల నాయకులకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. ప్రభుత్వం బీసీలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని కానీ వాటికి నిధులు మంజూరు చేయలేదన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తర్వాత మహిళలకు ఇప్పటికంటే అధికంగా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అనంతరం భవిష్యత్తుకు భరోసా కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, నియోజకవర్గ యువత అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు, ఎంపిటిసి కునుకు రమాదేవి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పేదలకు, మహిళలకు అండగా ఉండేది ఒక్క టిడిపినే అని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. కెపిపాలెం నార్త్‌లో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. రాజమండ్రి మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కాళ్ల

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరా మట్టి - మేరా భారత్ కార్యక్రమం పెదఅమిరం గ్రామ పంచాయతీతో కలిసి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని మట్టిని కాలుష్యం కోరల నుంచి కాపాడి ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ప్రతి ఒక్కరూ దేశభక్తి స్ఫూర్తితో మొక్కలు నాటాలన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గం సభ్యులు సాగి సత్య ప్రతీకవర్మ, పెద అమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, ఉప సర్పంచి జవ్వాది కిషోర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణ చైతన్య, విద్యార్థులు పెద్ద ఎత్తున పెదఅమిరం పంచాయతీ చెరువు చుట్టూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ప్రతి భారతీయుడు దేశ సంపదను ప్రకృతి వరం ఇచ్చిన మట్టి, నీటిని, పర్యావరణాన్ని కాపాడి భావితరాలకు సారవంతమైన భూమిని, నీటిని అందించాలని కోరారు. పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉపసర్పంచి జవ్వాది కిషోర్ మాట్లాడుతూ పెదఅమిరం గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థులతో పాటు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులు

రోడ్లను పటిష్టపర్చాలని 21న సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్లను వెంటనే పటిష్టపర్చాలని ఈ నెల 21న భీమవరం కలక్టరేట్ వరకూ సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు సిపిఎం మండల కమిటీ తెలిపింది. అలాగే వీరవాసరం మండల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సిపిఎం మండల సమావేశం ప్రజా ప్రతినిధులను, అధికారులను డిమాండ్ చేసింది. సిపిఎం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం గురువారం బొబ్బనపల్లి సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండలంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రహదారులు అధ్వానస్థితికి చేరుకున్నాయన్నారు. వీటి మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసుతులు కల్పించాలన్నారు. కరెంటు, రోడ్ల సదుపాయాల్లేక దోమలు, ఈగలతో సావాసం చేస్తున్నారన్నారు. సరైన సమయంలో పంట, మురుగు కాలువలను ప్రక్షాలన చేయకపోవడంతో వర్షాలకు ముంపు సమస్యలను, రైతులను అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో అన్ని పంచాయతీల్లో అపారిశుధ్య పరిస్థితులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రామారావు, గొట్టుముక్కల శ్యాంబాబు, యాళ్లబండి నారాయణమూర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తపాలా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు సమస్యలు పరిష్కరించాలని గురువారం తాడేపల్లిగూడెం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద డివిజనల్ కార్యదర్శి ఎం.రాధాకష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. గ్రామీణ తపాల ఉద్యోగులకు 8 గంటల పని కల్పించాలని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.ఐదు లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కలుగజేయాలని, గ్రాడ్యుటీ రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెయిడ్ లీవ్‌ను 180 రోజులకు నగదు సౌకర్యం కలుగు చేయాలన్నారు. దశలవారీ పోరాటంలో భాగంగా సెప్టెంబర్ 12వ తేదీన సర్కిల్ ఆఫీసుల ముందు ఒకరోజు నిరాహార దీక్ష, డిసెంబర్ 5వ తేదీ నుంచి నిరవదిక సమ్మె చేస్తామని రాధాకృష్ణ తెలిపారు. అనంతరం అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

భీమవరం హాస్పిటల్స్‌లో ఫైబ్రోస్కాన్, ఒలింపస్ 190 సిస్టం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ఎఐజి హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

నూతన పరికరాలపై అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, వైద్యులు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం హాస్పిటల్స్‌లో గురువారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో అత్యాధునిక ఎకోసైన్స్ ఫైబ్రోస్కాన్ (లివర్‌స్కాన్)స్మార్ట్ సి-ప్లస్ టెక్నాలజీ, ఒలింపస్ 190 సిస్టంను గురువారం నూతనంగా ప్రారంభించారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హైదరాబాద్ ఎఐజి హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి అత్యాధునిక పరికరాలను వర్చువల్ కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక పరికరాల ద్వారా ముందస్తుగా రోగుల సమస్యలను సులభంగా తెలుసుకోవచ్చున్నారు. వైద్య చికిత్సలతో పాటు, రోగులు సమతుల్య ఆహారం, శరీరక వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చున్నారు దశాబ్దాలుగా భీమవరం హాస్పిటల్ వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. సీనియర్ డాక్టర్, భీమవరం హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ గోపాలరాజు, మేనేజింగ్ డైరెక్టర్ కెవి.కృష్ణంరాజు, వైద్యులకు ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వి.ఎస్.శ్రీనివాస్, ఛైర్మన్ డాక్టర్ జి.గోపాలరాజు, మేనేజింగ్ డైరెక్టర్ కెవి.కృష్ణంరాజు మాట్లాడుతూ ఫైబ్రోస్కాన్ ద్వారా లివర్ (కాలేయం) ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవచ్చున్నారు. అధికంగా కొవ్వు కలిగిన వ్యక్తులు, మద్యపానం సేవించేవారు, షుగర్, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిరోసిస్ ఆఫ్ లివర్ కలవారికి ఎంతో అవసరమన్నారు. అలాగే ఒలంపిస్ 190 సిస్టం ఐ డెఫినిషన్ ఎండోస్కోప్స్ ద్వారా కొలనోస్కోపి, ఇఆర్‌సిపిల ద్వారా కడుపులో చిన్న ప్రేగులు, పెద్ద ప్రేగులను పరీక్షించి అత్యధిక నాణ్యతతో స్పష్టమైన ఇమేజ్లు డిజిటల్ ఇమేజ్లతో ప్రాథమిక దశలోనే అన్ని వ్యాధులను గుర్తించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎముకల వైద్య నిపుణులు, న్యూరాలజిస్టు, గైనకాలజిస్టు, ఫిజియోథెరపిస్టులు, పలమనాలజిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.


వర్చువల్‌గా మాట్లాడుతున్న హైదరాబాద్ ఎఐజి హాస్పిటల్ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆచంట

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని గ్యాస్ డెలివరీ బాయ్స్ యూనియన్ సిఐటియు అనుబంధం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఆచంట మార్కెట్ యార్డులో జరిగిన సమావేశానికి చామంతకూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అగ్రిమెంట్ టైం అయిపోయి ఐదు మాసాలు గడుస్తున్నా వేతనాలు పెంచడానికి యాజమాన్యం సిద్ధపడకపోవడం అన్యాయమన్నారు. కొన్ని ఏజెన్సీల్లో యూనిఫామ్ ఇవ్వకుండా, వెహికల్ మెంటినెన్స్ ఇవ్వకుండా, కనీస వేతనాలు అమలు చేయకుండా అగ్రిమెంట్‌కి సహకరించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. తక్షణం కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కేతా గోపాలం, సిఐటియు నాయకులు వర్ధిపత్తి అంజిబాబు, పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం సిఐటియు పనిచేస్తుందన్నారు. తక్షణం అగ్రిమెంట్స్ పూర్తి చేసి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంటా దోసపండు , విజయ్ కుమార్ బండారు ఏసు, నేదునూరి రమేష్, దాసం అన్నవరం, కడలి సీతయ్య, వెన్నపు రాజు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే వేగవంతం చేయాలి

ఎన్నికల సహాయ అధికారి ఎన్‌బి.విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఆకివీడు

బిఎల్ఒలు ఓటర్ల జాబితా సర్వే మరింత వేగవంతం చేయాలని తహశీల్దార్, ఎన్నికల సహాయ అధికారి ఎన్‌బి.విజయలక్ష్మి ఆదేశించారు. ఎన్నికల బ్లాక్ లెవెల్ అధికారులకు గురువారం మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆమె మాట్లాడారు. పేర్లు తప్పులు సరిచేయాలన్నారు. మండలంలో 60 పోలింగ్ బూత్‌లు ఉండగా పట్టణంలోనే 30 బూత్‌లు ఉన్నాయని తెలిపారు. ముందుగా మండల కేంద్రం ఆకివీడు పట్టణంలో మరింత వేగవంతంగా పని జరగాలన్నారు. ఎండిఒ వాణి మాట్లాడుతూ పని మొదలుపెట్టి 20 రోజులైనా ఇప్పటివరకూ 50 శాతం కూడా పూర్తి కాలేదని, మరో 10 రోజుల్లో మొత్తం పని పూర్తి కావాల్సి ఉందని ఆమె చెప్పారు. నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోగా సర్వే మొత్తం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల సమాచారం నిమిత్తం బూత్ స్థాయి అధికారులు, సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు.

ఐశ్వర్యను అభినందిస్తున్న యాజమాన్యం

ఐశ్వర్య ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చార్టర్డ్ అకౌంటెంట్ ఎంట్రన్స్ పరీక్షలో ప్రతిభ చాటిన ఐశ్వర్యను పలువురు అభినందించారు. పెదవెల్లమిల్లికి చెందిన రాయుడు ఐశ్వర్య సిఎ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన సందర్భంగా గురువారం స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఐశ్వర్య ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కృషి, ఏకాగ్రత, పట్టుదలతో విద్యపై దృష్టి సారిస్తే విజయం సాధ్యమవుతుందన్నారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ చార్టర్డ్ అకౌంట్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో రాయుడు ఐశ్వర్య అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఐశ్వర్యను కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు వెంకన్నబాబు, పద్మావతి, సూరిబాబు, ఉషారాణి, కనకారావు విద్యార్థులు అభినందించారు. అనంతరం పడాల గ్రామం లోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐశ్వర్య తల్లిదండ్రులు రాయుడు పౌలుకుమార్, మాలతి, సిబ్బంది పాల్గొన్నారు

సీసలిలో 'పొలంబడి'

ప్రజాశక్తి - కాళ్ల

ఆరుగాలం శ్రమించి పంటను పండించే రైతులు సాగులో మెళకువలు పాటించాలని వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకీ అన్నారు. సీసలి గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయవాసుకి మాట్లాడుతూ సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట, అధిక దిగుబడి సాధించేందుకు రైతును సమాయత్తపర్చడమే 'పొలంబడి' ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బిల్లకుర్తి శ్రీను, రైతులు వి.సుబ్బారాయుడు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి వైసిపి గ్రూపు విభేదాలు

గొల్లలకోడేరు ఆరో వార్డుకు 11 నామినేషన్లు

వైసిపి, టిడిపి మద్దతుదారులు కలిసి వేసిన నామినేషన్లు

రసవత్తంగా మారిన గొల్లలకోడేరు రాజకీయం

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపిలో గ్రూపు విభేదాలకు గొల్లలకోడేరు గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా ఆది నుంచి నిలుస్తోంది. ఆరో వార్డుకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రూపు విభేదాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఇక్కడ వైసిపిలో రెండు గ్రూపులు ఉన్నాయి. వైసిపి అధికారం చేపట్టిన నాటి నుంచి ఇవి కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆరో వార్డుకు ఉపఎన్నిక వచ్చింది. అయితే ఈ రెండు గ్రూపుల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ అవన్నీ పక్కనపెట్టి ఆరో వార్డు పదవికి ఎన్నికలు లేకుండా ఇనానమస్ చేయాలని, ఈ రెండు గ్రూపులు మొదట్లో ఆలోచన చేశాయి. దీనిపై చర్చలు, రాయబారాలు జరిగినప్పటికీ ఉన్నట్టుండి గ్రూపు విభేదాలు భగ్గుమన్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు గ్రూపులు ఆరో వార్డు పదవికి ఎన్నికలకు వెళ్లారు. దీనిలో భాగంగా గురువారం నామినేషన్ల ప్రక్రియ ముగింపు నాటి ఆరో వార్డు స్థానానికి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే వైసిపిలో ఉన్న ఒక గ్రూపు టిడిపి మద్దతుదారులతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. మరో గ్రూపు అధికార పార్టీకి చెందిన జెడ్‌పిటిసి, పంచాయతీ సర్పంచితో కలిసి వైసిపి మద్దతుదారులు నామినేషన్ దాఖలు చేశారు. అయితే వైసిపి, టిడిపి మద్దతుదారులు కలిసి నామినేషన్లు దాఖలు చేయడం ఒక ఎత్తు అయితే తమ పార్టీకి చెందిన మద్దతుదారుడని టిడిపి, కాదు తమ పార్టీకి చెందిన మద్దతు దారుడని వైసిపి చెప్పుకుంటోంది. అయితే ఈ అంశం అటు టిడిపి ఇటు వైసిపి కార్యకర్తల్లో మింగుడు పడనివ్వట్లేదు. ఈ నేపథ్యంలో చేసేదేమీ లేక ఇరు పార్టీలు మల్ల గుల్లలు పడుతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో వైసిపి టిడిపి ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ గొల్లలకోడేరులో మాత్రం ఈ రెండు పార్టీలు మిత్రపక్షాలుగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గొల్లలకోడేరు రాజకీయం ఆసక్తికరంగా మారింది. దీంతో గ్రామ రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ నేపథ్యంలో గొల్లలకోడేరు గ్రామంపై అందరి చూపు పడడంతో మండలంలో సార్వత్రిక చర్చ సాగుతోంది. ఇదిలా ఉంటే జనసేన మద్దతుదారులు కూడా ఒక నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారిగా శివకృష్ణ, రమాలీలలు వ్యవహరించగా భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్ నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు.


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైసిపి చెందిన ఒక వర్గం

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు పొలమూరు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు పొలమూరు హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని దారపురెడ్డి దుర్గ తులసి ఎంపికైనట్లు ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం హైస్కూల్ గ్రౌండ్ పరిధిలో దుర్గ తులసీని హెచ్ఎం బి.సరస్వతి ఆధ్వర్యంలో అభినందించారు. ఈ విద్యార్థిని స్కాలర్‌షిప్‌కు ఎంపికకావడంతో ఇంటర్ వరకూ రెండు ఏటా రూ.12 వేలు లబ్ధి పొందడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తులసీని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలేపల్లిలో నాదేశం - నాభూమి

ప్రజాశక్తి - వీరవాసరం

బాలేపల్లి గ్రామంలో నాదేశం - నాభూమి కార్యక్రమం సర్పంచి యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాభూమి - నాదేశ స్తూపాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఆజాది కా అమృతోత్సవాల్లో భాగంగా మరోసారి జాతీయ స్ఫూర్తి ప్రేరేపించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయంలో నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం పంచ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఐదు రకాల ప్రతిజ్ఞలు ఛైర్మన్ కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులచేత చేయించారు. కార్యక్రమంలో ఛైర్ పర్సన్ జామి హైమావతి, వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, కౌన్సిలర్లు కట్ట రవీంద్రనాథ్, గేదెల అప్పారావు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని కొణితివాడ, వీరవాసరం పిహెచ్‌సిల పరిధిలో గురువారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రయివేటు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాత్రలు అందజేశారు. కొణితివాడ పిహెచ్‌సి పరిధిలో తొంభై మూడు శాతం విద్యార్థులకు మాత్రలు అందజేసినట్లు వైద్యాధికారి టి.లక్ష్మీఅలేఖ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జె.సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ల: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు, రక్తహీనత సమస్యలు లేకుండా చూసేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని వైద్యాధికారి డాక్టర్ ఎం.గులాబ్ రాజ్ కుమార్ అన్నారు. గురువారం కోపల్లె హైస్కూల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి పశ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు వల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బరాజు, ఎంపిటిసి లంక భవాని, తల్లిదండ్రుల కమిటీ ఛైర్ పర్సన్ ముంజేటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : నులిపురుగుల నిర్మూలన వల్ల అనేక ప్రయోజనాలున్నాయని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ ప్రసాద్ రాజు అన్నారు. మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రతి ఒక్కరికీ మాత్రలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు, వైద్యులు దేవి, పిఎస్‌సి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఉండి : మండలంలోని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 10765 మంది చిన్నారులకు గాను 10493 మందికి గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు డాక్టర్ పంజా ధర్మతేజ, డాక్టర్ బిన్నీ శామ్యూల్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నులిపురుగు నివారణ దినోత్సవంలో భాగంగా ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరి నారాయణరాజు మాట్లాడారు.

నియంతృత్వ పాలనకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, ఇటువంటి నియంతృత్వ పాలనకు స్వస్తి పలకాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎల్ఎన్ గ్రామంలో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతోపాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వైసిపి అధికారంలోకి వచ్చాక అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తోట ఫణిబాబు, బొక్కా నరసింహస్వామి, కాలవ లక్ష్మి, తిరుమలశెట్టి లీలావతి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది
POKURI VAISHNAVI, W/o. Pokuri Sridhar, అను నాకు భీమవరం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.18-10-2022న W5291206 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు ది. 09-08-2023వ తేదీన జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి ఏలూరు 1 టౌన్ కుండి సెంటరు వద్దకు వచ్చే సరికి నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుచున్నాను.
POKURI VAISHNAVI
W/o. Pokuri Sridhar, H.No. 6C-6-5,
దక్షణపు వీధి, ఏలూరు-534001